పరిష్కార 'మార్గం' ఎప్పుడో ?


నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణం

- హడావిడిగా ప్రారంభించి.. అర్ధాంతరంగా నిలిపేశారు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- బెంబేలెత్తుతున్న వాహనదారులు

ఇబ్రహీంపట్నం: హైదరాబాద్–ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారిలో వంతెన నిర్మాణం ఇంకా పూర్తి కాకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ఈ రహదారిపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో నిర్మాణ పనులను ప్రారంభించారు. కారణం తెలియదు కానీ.. అర్ధాంతరంగా నిలిపేశారు. కొత్త ప్రభుత్వమైనా కరుణించి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని వేడుకుంటున్నారు. హైదరాబాద్–ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారిలోని శేరిగూడ సమీపంలోని ఇందు కళాశాల వద్ద నిలిచిపోయిన బ్రిడ్జి నిర్మాణ పనులు తిరిగి ఎప్పుడు ప్రారంభిస్తారోనని వాహనదారులు, ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఏడాది క్రితం ఈ పనులను హడావిడిగా ప్రారంభించి.. అర్ధాంతరంగా నిలిపేశారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు నిండి అలుగు దూకింది. సుమారు 45 ఏండ్ల తర్వాత చెరువు మత్తడి దూకి వరద ప్రవాహం ఉధృతంగా పారడంతో ఇందు కళాశాల వద్ద ప్రధాన రహదారిలోని కల్వర్టు పైపులు కొట్టుకుపోయాయి. అయితే శాశ్వత పరిష్కారం కోసం బ్రిడ్జిని నిర్మించాలని అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిధులు విడుదల కావడంతో పనులను కూడా ప్రారంభించారు. కానీ మధ్యలోనే పనులు ఆగిపోయాయి. దీంతో రాకపోకలకు తిప్పలు తప్పడం లేదు.

అవస్థలు పడుతున్న వాహనదారులు

బ్రిడ్జిపై ఒకవైపు మాత్రమే స్లాబ్ వేశారు. రెండో వైపు నిర్మాణ పనులను ఇంకా ప్రారంభించలేదు. తాత్కాలికంగా మట్టిరోడ్డును ఏర్పాటు చేశారు. సింగిల్ రోడ్డుపై వాహనాలు ఎదురెదురుగా వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చర్యలు తీసుకోవాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

మల్‌రెడ్డి దృష్టి సారించాలి



గత ప్రభుత్వ హయాంలో పనులు ప్రారంభించి.. అర్ధాంతరంగా నిలిపేశారు. ప్రజలు, వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఈ రహదారి దాటాల్సివస్తోంది. అసంపూర్తిగా ఉన్న నిర్మాణాన్ని కొత్త ప్రభుత్వమైనా పూర్తి చేయాలి. ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చేందుకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టి పెట్టాలి.

– తమ్మళ్ల కృష్ణ, ఇబ్రహీంపట్నం

ప్రయాణం నరకప్రాయం



పనులను పునః ప్రారంభించేందుకు మల్‌రెడ్డి రంగారెడ్డి నజర్ పెట్టాలి. బ్రిడ్జి నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలివేయడంతో అవస్థలు పడుతున్నాం. ఇరుకైన రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా ఉంది. రంగారెడ్డి చొరవ తీసుకొని వెంటనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలి.

– హరినారాయణ, దండుమైలారం

అమెరికాలో కాంగ్రెస్ సంబురాలు


కేక్ కట్ చేస్తున్న ఎన్ఆర్ఐ కాంగ్రెస్ నేతలు

ఆమనగల్లు: తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు స్వీకరించడాన్ని హర్షిస్తూ అమెరికాలోని ఫిలడెల్ఫియాలో పీసీసీ ఎన్ఆర్ఐ సెల్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి సంబురాలు నిర్వహించారు. వేడుకల్లో పెద్ద సంఖ్యలో ప్రవాస భారతీయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎన్ఆర్ఐ జగదీశ్వర్‌రెడ్డిని పీసీసీ ఎన్ఆర్ఐ సెల్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం కేక్ కట్ చేశారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఎన్ఆర్ఐ సెల్ సభ్యులు రమణ, ప్రసాద్, కిరణ్, మధు, గిరిధర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న జెడ్పీటీసీ

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణానికి చెందిన వస్పుల వెంకటేశ్ అనే యువకుడు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మృతుని కుటుంబాన్ని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం పరామర్శించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే ఎడ్మ కిష్టారెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యులు బీమయ్యగౌడ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు బాలస్వామి, మాజీ సర్పంచ్ అశ్విత్, స్థానిక నాయకులు మత్తయ్య, రంజిత్, రాములు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

కడ్తాల్: కడ్తాల్‌కు చెందిన జంగయ్య ఆదివారం ఉదయం మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ పరామర్శించారు. అనంతరం మండల పరిధిలోని సాలార్‌పూర్ గ్రామంలో మృతి చెందిన వరుణ్ కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. పరామర్శించిన వారిలో ఎంపీటీసీ ప్రియా రమేశ్, మాజీ ఎంపీపీ సువాలి పంతునాయక్, మాజీ ఎంపీటీసీ సాయిలు, నాయకులు శంకర్, బాబా, జగన్, చంద్యా, జైపాల్, బన్సీలాల్ ఉన్నారు.

ఉత్సవాలకు సాయం

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు జనవరి 15వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కాడమోని శ్రీశైలం ఉత్సవాల నిర్వహణ కోసం రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని ఆలయ అర్చకులకు అందజేశారు. ఆలయంలో అర్చన, మహా నివేదన, హారతి, తిరుప్పావై ప్రవచనములు, తీర్థ ప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు రామాచారి, పద్మనాభం, భక్తులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి


సమావేశంలో మాట్లాడుతున్న పాషా

ఆమనగల్లు: ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎం.ఎ.పాషా కోరారు. ఆమనగల్లు పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ టెక్నో హైస్కూల్ ఆవరణలో ఆదివారం విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాషా మాట్లాడుతూ కాలనీలో కనీస వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. నీటి సౌకర్యం, సీసీ రోడ్లు వేయాలని, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి జంగయ్య, కోశాధికారి సుదర్శన్‌రెడ్డి, సభ్యులు పాండు, పత్యానాయక్, వెంకటేశ్వర్‌రెడ్డి, పర్వతాలు, ఆరిఫ్, రమేశ్, రాఘవాచారి, మల్యానాయక్, తావుర్యానాయక్, సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

హుడాకాంప్లెక్స్: క్రైస్తవులు పవిత్రంగా జరుపుకొనే క్రిస్మస్ పండగను పురస్కరించుకుని ఆదివారం గాడ్ ఆల్మైటీ చర్చిలో పాస్టర్ డేవిడ్ శేఖర్ ఆధ్వర్యంలో ముందస్తు వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ మహేశ్వరం ప్రధాన కార్యదర్శి బేర బాలకిషన్ హాజరై కేక్‌ను కట్‌చేసి సంబరాలు ప్రారంభించారు. కార్యక్రమంలో పాస్టర్లు అరుణ జ్యోతి, కేఎల్‌బీ శాస్త్రి, ముజాహిద్ దేవ్ కృపానందం, క్రిస్టియన్‌లు పాల్గొన్నారు.

ఎంసీఆర్ కాలనీ కమిటీ ఎన్నిక

బడంగ్‌పేట: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎంసీఆర్ కాలనీ కమిటీ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికయింది. అధ్యక్షునిగా వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా నర్సింహా, కోశాధికారిగా హరినాయక్‌ను ఎన్నుకున్నారు.

సృజనాత్మకతతో మెరుగైన ఫలితాలు


ప్రదర్శనలో తిలకిస్తున్న కార్తీక్ రెడ్డి

సైన్స్ ఎగ్జిబిషన్ ప్రారంభం

పహాడీషరీఫ్: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడతాయని బీఆర్ఎస్ యువ నాయకుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ షాహీన్ నగర్‌లోని జామియా దారుల్ హుదా హైస్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు బాల్యం నుంచే ప్రాక్టికల్స్ విద్యావిధానంపై అవగాహన కల్పించడం ద్వారా ఆలోచన శక్తిని పెంచినట్లవుతుందన్నారు. దాదాపు 150 మంది విద్యార్థులు ప్రదర్శనలో ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, శంషూద్దీన్, మేరాజ్ ఖాన్, సయ్యద్ అబ్దుల్ రవూఫ్, సయ్యద్ ఫెరోజ్, మజ్హర్ అలీ, బర్కత్ అలీ, అలీ మసూరీ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో సోమవారం (నేడు) ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ పాషా ఓ ప్రకటనలో తెలిపారు. శిబిరంలో కంటిచూపు మందగించిన వారికి ఉచితంగా కంటిపరీక్షలు నిర్వహిస్తామని అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. రోగులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు తీసుకుని రావాలని సూచించారు. శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వేంకటగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల సందర్భంగా వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. అర్చకుడు గూడ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, తులసీదళ అర్చన, తిరుప్పావై, ప్రభంద విన్నపం, నక్షత్రహారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అన్యాయం చేస్తే ఊరుకోం

యాచారం: రైతుబంధు నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాశ్ఛ భాషా డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పట్టాదారు, పాసు పుస్తకాల్లో పేర్కొన్న ఎకరాలకు మొత్తం రైతుబంధు నిధులు ఇవ్వాల్సిందేనని అన్నారు. రైతులకు అన్యాయం చేస్తే ఊరుకోమని హెచ్చరించారు.

రామానుజన్ సేవలు అమోఘం


మ్యాథ్స్ టెస్ట్‌కు హాజరైన విద్యార్థులు

ఆల్ఫోర్స్ ఆధ్వర్యంలో మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్

హుడాకాంప్లెక్స్: భారతదేశ గణిత శాస్త్ర అభివృద్ధికి నూతన అధ్యాయాన్ని కనుగొన్న మహనీయుడు శ్రీనివాస రామానుజన్ అని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డా.వి.నరేందర్‌రెడ్డి కొనియాడారు. ఘట్‌కేసర్, సరూర్‌నగర్, కర్మన్‌ఘాట్, నల్లకుంట, గుర్రంగూడ, సుచిత్ర, అల్వాల్‌లో ఆల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలింపియాడ్ టెస్ట్ నిర్వహించారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే రామానుజన్ గణితశాస్త్రం పట్ల చాలా దృష్టి వహించేవారని, అదే ఆసక్తిని క్రమక్రమేనా పెంపొందించుకున్నారన్నారు. పలు శాస్త్రవేత్తలు చేపట్టినటువంటి పరిశోధనలకు ఆకర్షితులై ప్రత్యేకంగా గణిత శాస్త్రంలో నూతన విషయాలకు బీజం వేశారన్నారు. అనంతరం రాష్ట్రంలోని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు సుమారు 1200 మందికి పరీక్ష నిర్వహించామన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి


పురుషోత్తం

ఇబ్రహీంపట్నం: అన్ని రంగాల్లో వెనుకబడ్డ పూసల కులస్తులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పూసల అభివృద్ధి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నూతనగంటి పురుషోత్తం కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ హయాంలో తమ వెనుకబాటును గుర్తించి బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూప్ లోకి మార్చారని గుర్తుచేశారు. తమను ఎంబీసీ చేర్చాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పూసల కులస్తులను ఎంబీసీలో కలపాలని కేంద్రానికి ప్రతిపాదించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయంగా సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తమకు రాజకీయ ప్రాధాన్యతను కల్పించాలని ప్రభుత్వానికి విన్నవించారు.

రోడ్డుపై కంకర.. ఆదమరిస్తే అంతే!


కంకర తేలిన కలెక్టర్ కార్యాలయ రోడ్డు

ప్రమాదకరంగా రహదారి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల నుంచి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఇది నెహ్రూ ఔటర్ రింగు రోడ్డుకు అనుకొని ఉండటంతో ఈ ప్రాంతంలో కాంక్రీట్ మిక్స్‌డ్ (ఆర్ఎంసీ) కేంద్రాలు ఉన్నాయి. నిత్యం కంకర, డస్టు వాహనాలు రావడంతో రహదారి వెంబడి దుమ్ము ధూళి దర్శనమిస్తోంది. వాటి అవశేషాలు రోడ్డుపై పడడంతో తరచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ మార్గంలో జిల్లా కలెక్టర్‌తో పాటు, ఉన్నత స్థాయి అధికారులు ప్రయాణం చేయడం గమనార్హం.

క్లుప్తంగా

మల్‌రెడ్డి విజయం శుభపరిణామం


కాంగ్రెస్ నాయకులకు స్వాగతం పలుకుతున్న సంజీవ తదితరులు

మంచాల: ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి గెలుపొందడం శుభ పరిణామమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సంజీవ అన్నారు. మల్‌రెడ్డి ఎన్నికల్లో గెలుపొందడంతో ఆదివారం లోయపల్లి గ్రామం నుంచి కాంగ్రెస్ నాయకులు దాస్‌గౌడ్, వెంకటేశ్ పాదయాత్రగా వెళ్లి ఇబ్రహీంపట్నంలోని కట్టమైసమ్మ ఆలయంలో మొక్కతీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకుడు చేతాళ్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాటసింగారంలో క్రికెట్ పోటీలు


మైదానంలో క్రీడాకారులు

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రతి ఏటా సంక్రాంతికి ముందుగా నిర్వహించే క్రికెట్ పోటీలు ఆదివారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామంలో ప్రారంభమయ్యాయి. బీపీఎల్ –4 (బాటసింగారం ప్రీమియం లీగ్) టోర్నమెంట్‌ను స్థానిక సర్పంచ్ లతాశ్రీ, ఎంపీటీసీ వెంకటేశ్, కో–ఆప్షన్ సభ్యుడు గౌస్ పాష, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ధన్‌రాజ్‌గౌడ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఏసూరి రాజు, అశోక్, సాయిచంద్, సరిపల్లి నవీన్, మహేశ్, రవి, సందీప్, యువకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


యాదయ్యగౌడ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కసిరెడ్డి తదితరులు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెంకటపూర్‌కు చెందిన కల్వకుర్తి జేఏసీ అధ్యక్షుడు సదానందంగౌడ్ తండ్రి యాదయ్యగౌడ్ ఇటీవల మరణించాడు. ఆదివారం దశదినకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వెంకటాపూర్‌కు వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. యాదయ్యగౌడ్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, సర్పంచ్ రమేశ్‌యాదవ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూలో చేరిన వారికి సభ్యత్వాలు


సభ్యత్వాలు అందజేస్తున్న గోవర్ధన్‌యాదవ్

ఇబ్రహీంపట్నం: పీఆర్టీయూలో చేరిన ఇబ్రహీంపట్నం ఎస్టీయూ మండల బాధ్యుడు డబ్బికార్ గోవర్ధన్, యూటీఎఫ్ మండల బాధ్యుడు మహేశ్‌కు ఆదివారం ఆ శాఖ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ యాదవ్, మండల అధ్యక్షుడు వర్కాల పరమేశ్ సభ్యత్వాలిచ్చి యూనియన్‌లో చేర్చుకున్నారు. పీఆర్టీయూ చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై యూనియాన్‌లో చేరినట్లు ఈ గోవర్ధన్, మహేశ్ తెలిపారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం


క్రీడాకారులకు సామగ్రి అందజేస్తున్న లింగం ముదిరాజ్

మహేశ్వరం: మండల పరిధిలోని నాగారం గ్రామంలో వాలీబాల్ ఆటగాళ్లకు బీఆర్ఎస్ నాయకుడు బండారి లింగం ముదిరాజ్ ఆదివారం టీషర్ట్స్, నెట్ తదితర క్రీడా సామగ్రిని అందజేశారు. గ్రామీణ ప్రాంతంలో క్రీడల్లో ఆసక్తి ఉన్న యువతను ప్రోత్సహించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. వాలీబాల్ ఆటల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి గ్రామానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన సూచించారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేస్తామన్నారు. బీఆర్ఎస్ నాయకుడు రాములు ముదిరాజ్, క్రీడాకారులు పాల్గొన్నారు.



